క్లుప్తంగా

ముగిసిన మస్తాన్‌వలి ఉరుసు


స్వామి షంషేర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

తుగ్గలి : మండలంలోని మారెళ్లలో వెలసిన బాబా మస్తాన్‌వలి ఉరుసు గురువారం ముగిసింది. వేకువజామున పూలతో అలంకరించిన షంషేర్‌ను గుర్రంపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. భక్తులు స్వామికి కొబ్బరికాయ, చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేడు సిద్ధేశ్వరస్వామి రథోత్సవం


తేరు వీధిని సిద్ధం చేస్తున్న దృశ్యం

హొళగుంద : ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాల ప్రజల ఆరాధ్య దైవమైన హొళగుంద శ్రీ సిద్ధేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం ఘనంగా జరుగనుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్, హరీష్‌గౌడ్ పూర్తి చేశారు. మూడు రోజుల పాటు స్థానిక కళాకారులతో కుడుక కట్టిద తాళి అనే సామాజిక, వీరాభిమన్యు కాళగ అనే బయలు కన్నడ నాటకాలు ప్రదర్శించనున్నారు. సర్పంచ్ చలువాది రంగమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరి రాజశేఖర్ ఉత్సవాలకు తేరువీధి, ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నారు.

బెల్లం ఊట ధ్వంసం


చిట్యాల శివారులో బెల్లం ఊటను పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు


కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామ శివారులో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన ఊట బెల్లంను కోడుమూరు ఎక్సైజ్ పోలీసులు గురువారం పారబోశారు. గ్రామ శివారులో నాటుసారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 2,200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ చంద్ర మోహన్ తెలిపారు. మండలంలో ఎక్కడైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎల్లార్తి దర్గాల్లో ప్రత్యేక ఫాతెహాలు


షాషావలి దర్గాలో సమాధిని దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి దర్గాల్లో గురువారం భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాత్రి అక్కడె నిద్రించి మొక్కు చెల్లించుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగి తాతా దర్గాల్లో కూడా ఫాతెహాలు చేసి చక్కెరను నైవేద్యంగా సమర్పించారు. సాయిబాబాను దర్శించుకుని పూజలు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

మద్దికెర : స్థానిక విద్యాసాయి పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదోనిలోని ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన వేదిక్ మ్యాథ్‌మ్యాటిక్స్, అబకాస్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ మాధవ్, ప్రిన్సిపాల్ సునీత గురువారం తెలిపారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పునీత్, మోక్షిత, నవీన్, అఫ్రీన్ పాల్గొంటారని చెప్పారు.

డీఎల్‌పీఓ విచారణ


పంచాయతీ అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ లక్ష్మి

వెల్దుర్తి: మండల కేంద్రం నుంచి గ్రీవెన్స్‌లో అందిన ఫిర్యాదులపై డీఎల్‌పీఓ లక్ష్మి గురువారం విచారించారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం చేరుకుని ఫిర్యాదు దారులతో మాట్లాడారు. వారి సమస్యలను పరిష్కరిస్తామని, ఫిర్యాదులపై నిక్కచ్చిగా విచారణ జరుగుతుందని చెప్పారు. అనంతరం ఈఓఆర్డీ రవికిశోర్, ఈఓ లక్ష్మీనాథ్‌తో సమావేశమై పట్టణంలో తాగునీటి సరఫరాపై ఆరా తీశారు.

దిగుబడి ధర లేదు

గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్ అన్నదాతలకు నష్టాలనే మిగిల్చింది. వాతావరణం అనుకూలించక, తెగుళ్లు చుట్టుముట్టడంతో పంట దిగుబడులు తగ్గిపోయాయి. దీనికి తోడు ఉత్పత్తులకు మార్కెట్‌లో ధర లభించక భారీగా నష్టాలు మూటగట్టుకున్నారు. మరో వైపు ప్రభుత్వం నుంచి సహకారం కొరవడటంతో అప్పుల ఊబిలో కూరుకుపోయారు. గత రబీలో ప్రభుత్వం పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, వెల్దుర్తి మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా ఇంత వరకు పరిహారం అందించిన పాపాన పోలేదని నిష్ఠూరమాడుతున్నారు.

- కలిసిరాని ఖరీఫ్.. ఆదుకోని రబీ
- ప్రధాన పంటలు సాగుచేసిన రైతుల ఆవేదన
- ప్రభుత్వ భరోసా కరువు

తుగ్గలి : ఆరుగాలం కష్టించే రైతన్నకు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. గతేడాది ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల దిగుబడులు తగ్గి నష్టాలు మూట గట్టుకున్నారు. తెగుళ్ల నివారణకు, కూలీల ఖర్చు, విత్తనాలు, ఎరువులు, సేద్యపు ఖర్చులు తడిసి మోపెడయ్యాయి. ప్రతికూల వాతావరణం సాగు చేసిన అన్ని పంటలపై ప్రభావం చూపడంతో దిగుబడులు తగ్గిపోయాయి. దీనికి తోడు ఆశించిన ధరల్లేక పంటల సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాక రైతులు అప్పులపాలయ్యారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతాంగాన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం రూ.20వేలు ఇస్తామని చెప్పి అధికారం చేపట్టగానే కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. గత రబీలో పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, వెల్దుర్తిని కరువు మండలాలుగా ప్రకటించినా నేటికీ రైతులకు పరిహారం అందలేదు. కాగా.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ సీజన్‌లో నష్టపోతే అదే సీజన్ ముగిసిన వెంటనే పరిహారం అందేది.

'కంది' పోయిన రైతు..

కంది పంట సాగు చేసిన రైతుల్లో కలవరం వీడటం లేదు. పంట కోతల సమయంలో క్వింటా రూ.9,600 ఉన్న ధర దిగుబడులు చేతికి రాగానే రూ.7,200కు పడిపోయింది. ఒకేసారి రూ.2వేలకు పైగా ధర తగ్గడంతో దిగాలు చెందుతున్నారు. గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామంటూ బీరాలు పలికిన ప్రభుత్వం మండలానికి ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. బయట మార్కెట్‌కు, కొనుగోలు కేంద్రానికి రూ.200, రూ.300 మాత్రమే తేడా ఉంది. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం, పరిమిత కొనుగోలు వంటి అనేక కొర్రీలతో కేంద్రాల్లో పంట విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు.

పప్పు'శని'గ..

రబీలో ప్రధాన పంటగా సాగు చేసిన పప్పుశనగ కూడా రైతులను ఆదుకోలేకపోయింది. ఎకరాకు 7 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 3-5 క్వింటాళ్లలోపే వచ్చింది. ధర కూడా రూ.5,500 అందుతుండటంతో ఈ మొత్తం పెట్టుబడులకు కూడా సరిపోదని ఆవేదన చెందుతున్నారు. విత్తనం సమయంలో రైతులు క్వింటా రూ.7,100 చొప్పున కొనుగోలు చేసి విత్తారురు. ప్రస్తుతం అమ్ముకునేందుకు వెళ్తే క్వింటా రూ.5,500 మించి ధర పలకడం లేదు. దీంతో వారు కన్నీరుమున్నీరవుతున్నారు.

టమా'టా'..

ఖరీఫ్ సీజన్‌లో టమాట సాగు చేసిన రైతులు డీలా పడ్డారు. ప్రారంభంలో కొద్దిరోజులుగా ధర ఉన్నా ఆ తర్వాత పాతాళానికి పడిపోయింది. కిలో రూపాయి, రెండు రూపాయలు ఇస్తుండటంతో ఆ మొత్తం కూలీలు, రవాణా ఖర్చులు కూడా రాక పంటను పొలాల్లో వదిలేశారు. ఆదుకుంటుందని భావిస్తే అధఃపాతాళానికి తొక్కేసిందని వాపోతున్నారు.



ఈ రైతు పేరు మునిరెడ్డి, బొందిమడుగుల గ్రామవాసి. ఈ ఏడాది ఖరీఫ్‌లో మిర్చి పంట సాగు చేశాడు. గతేడాది లభించిన దిగుబడి, ధరను చూసి ఈ ఏడాది మరింత పొలం కౌలుకు తీసుకొని సాగు చేశాడు. అయితే.. తెగుళ్లతో దిగుబడి రాక.. మార్కెట్‌లో ధర లేక భారీగా నష్టాలు మూటగట్టుకున్నాడు. 'సొంత పొలం 5 ఎకరాలతో పాటు ఎకరాకు రూ.10వేల చొప్పున మరో 5 ఎకరాలు గుత్తకు తీసుకుని మిర్చి పంట సాగు చేశాం. మొత్తం రూ.8 లక్షలకు పైగా పెట్టుబడి వచ్చింది. తెగుళ్లతో దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. గతేడాది ఎకరాకు 25 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. క్వింటా రూ.30వేల ప్రకారం అమ్మాం. ఈ సారి ఎకరాకు 10 క్వింటాళ్లకు దాటలేదు. ధర కూడా క్వింటా రూ.13వేలకు మించి పలకడం లేదు. కోలుకోలేని నష్టం మిగిల్చింద'ని ఆవేదన వ్యక్తం చేశాడు.


తుగ్గలి వద్ద బొందుపోయిన పప్పుశనగ (ఫైల్)



పంటలు చేతికందగానే మార్కెట్‌లో ధరలు పడిపోతున్నాయంటున్న ఈ రైతు పేరు బాబుసాహెబ్, చెన్నంపల్లి గ్రామస్తుడు. పంట కోత ముందు వరకు ఆయా రకాల పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో ధర బాగానే ఉంటుంది. కోతలు మొదలయ్యే పాటికి ఒక్కసారిగా పడిపోతుంది. ఏటా ఇదే తీరు. వ్యాపారుల మాయాజాలాన్ని ప్రభుత్వం అడ్డుకోకపోవడంతో భారీగా నష్టపోతున్నామంటున్నాడు. 'ఐదెకరాల్లో కంది పంట వేశాం. వాతావరణం సరిగా లేక పూత రాలిపోవడం, తెగుళ్లతో పంట దెబ్బతింది. తీరా అరకొరగా దిగుబడులు చేతికొచ్చే సరికి క్వింటా రూ.9,600 ఉన్న ధర ఉన్నఫలంగా రూ.2వేలకు పైగా తగ్గి రూ.7వేల ప్రకారం కొంటున్నారు. ధర పెరుగుతుందేమోనని దిగుబడిని అమ్మకుండా నిల్వ చేశాం. పెట్టుబడి దక్కాలంటే.. క్వింటా ధర రూ.10వేలు ఉండాలి.

ఏడిపిస్తున్న 'ఎర్ర బంగారం'..

ఎర్ర బంగారంగా పిలువుచుకునే మిర్చి పంట రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ప్రతికూల వాతావరణంతో పంటకు విపరీతంగా తెగుళ్లు సోకాయి. వాటిని నివారించేందుకు రైతులు లక్షలు అప్పులు చేశారు. ఇంత చేసినా దిగుబడులు మాత్రం పెరగలేదు. ఎకరాకు 25 నుంచి 40 క్వింటాళ్లు రావాల్సి ఉండగా కేవలం 10 క్వింటాళ్ల లోపే వచ్చాయి. ధర కూడా క్వింటాకురూ.15వేల లోపు ఉండటంతో కోలుకోలేని నష్టాలు మిగిలాయి.


బొందిమడుగుల వద్ద కల్లంలో వామి వేసిన ఎండుమిర్చి

మండలాల వారీగా ఖరీఫ్, రబీలో సాగైన పంటలు (హెక్టార్లలో)..

మండలం	వేరుశనగ	కంది	టమాట	మిర్చి	పప్పుశనగ
పత్తికొండ	3,289	1,042	1,733	1,137	2,932
కృష్ణగిరి	10,662	2,318	50	974	460
వెల్దుర్తి	1,045	4,688	145	44	376
మద్దికెర	1,100	3,632	156	407	7,405
తుగ్గలి	5,006	9,270	2,265	400	899


కోయకుండా పొలంలోనే టమాటలను వదిలేసిన దృశ్యం

ఖర్చులు కూడా రావడం లేదు



రెండెకరాల్లో టమాట పంట సాగు చేశా. రూ.80 వేలకు పైగా పెట్టుబడి వచ్చింది. దిగుబడులు వచ్చే సమయానికి రేట్లు పూర్తిగా పడిపోయాయి. కూలీలు, రవాణా ఖర్చులు కూడా రావడం లేదు. పెట్టుబడి కూడా రాక నష్టం పోయాం. ధరల్లేక టమాట కాయలు తెంచడమే మానేశాం. ఇక ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం అందుతుందేమోననుకున్నాం. అదేమీ లేదని అర్థమైంది. సర్కారు చేయూతనివ్వకపోతే రైతు కోలుకోలేడు. – రామాంజనేయులు, రైతు, ఎద్దులదొడ్డి

ఆ స్థలాలకు యాజమాన్య హక్కు పత్రాలు ఇవ్వలేం

ఆలూరు రూరల్: హై కోర్టు ఉత్తర్వుల మేరకు గ్రామ కంఠం భూములకు ఇంటి యాజమాన్య హక్కు ధ్రువీకరణ పత్రాలు జారీ చేయబోమని మండలంలోని పంచాయతీ కార్యదర్శులు తెలిపారు. గురువారం వారు ఆలూరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ వేణు గోపాల్‌ను కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములు, గ్రామ కంఠం భూములకు ఇంటి యాజమాన్య హక్కు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేహక్కు తమకు లేదన్నారు. ఆయా గ్రామాల నుంచి గ్రామ కంఠం స్థలాలు, ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌కు వచ్చే వారిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శుల నుంచి యాజమాన్య హక్కు ధ్రువీకరణ పత్రాలు తీసుకోరావాలని సూచిస్తున్నారన్నారు. దీంతో వారు మాపై ఒత్తిడి తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ఆ భూములకు ఎలాంటి హక్కు పత్రాలు జారీ చేయరాదని గత ఏడాది మార్చి 3న జిల్లా పంచాయతీ అధికారి సర్క్యులర్ పంపించారన్నారు. వాటి హక్కు పత్రాల జారీ రెవెన్యూ అధికారులదేనని ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. ఇచ్చిన ఆదేశాలు ధిక్కరించి హక్కు పత్రాలు జారీ చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారని సబ్‌రిజిస్ట్రార్‌కు వివరించారు. పంచాయతీ కార్యదర్శులు విజయ్, జిలాన్, వెంకట్ నాయుడు, ఉరుకుందప్ప, హుల్తెప్ప,గర్జప్ప, రామాంజినమ్మ, నిఖిల్ మోడి, నాయక్ ఉన్నారు.


ఆలూరు ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందిస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శులు

పంట దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించాలి

హాలహర్వి: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గిడ్డయ్య డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో విరుపాపురం గ్రామంలోని పీర్ల చావిడి వద్ద సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ ప్రాంతంలో స్థానికంగా పనులు లేకపోవడంతో పట్టణాలకు వలసలు వెళ్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం ఇంతవరకు రైతులకు అందలేదన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తిరుగుబాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ కమిటీన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా విశ్వనాథ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా రోగప్ప, బోయ ఆంజనేయ, కార్యదర్శిగా విశ్వనాథ, సహాయ కార్యదర్శిగా మోకా, గాదిలింగప్ప, ట్రెజరీ శేఖన్నను ఎన్నుకున్నారు.


విరుపాపురంలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆలూరు రూరల్: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా సరఫరా చేస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత తెలిపారు. గురువారం మధ్యాహ్నం స్థానిక ఎక్సైజ్ పోలీసు కార్యాలయ ఆవరణలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గురువారం ఉదయం ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామ సమీపంలోని బంగారమ్మ ఆర్చ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా హుండయ్ కేఏ 37 ఎన్ 6819 నంబరు గల కారులో తరలిస్తున్న 10 బాక్సులు కర్ణాటక మద్యం (86.4 లీటర్లు) గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కర్ణాటక రాష్ట్రం గంగావతికి చెందిన రవి అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కారును సీజ్ చేసినట్లు సీఐ చెప్పారు. తనిఖీల్లో ఎస్‌ఐ నవీన్ బాబు, సిబ్బంది మాలవ్య, విజయ్ కుమార్, సోమేష్ పాల్గొన్నారు.


పట్టుబడిన మద్యం, కారును చూపుతున్న ఆలూరు ఎక్సైజ్ పోలీసులు

అక్రమ మైనింగ్ రాళ్ల సీజ్

వెల్దుర్తి: మండలంలోని నర్సాపురం గ్రామ పరిధిలో అక్రమంగా తవ్వి తీసి ఉంచిన బండరాళ్లను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. గురువారం మైనింగ్ ఆర్‌ఐ సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. అక్రమ మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి నిలువ ఉంచిన 111 రాతి దూలాలను సీజ్ చేసి వీఆర్‌ఓ మాలాలికి స్వాధీనం చేసినట్లు చెప్పారు. టీఏ బాలనాయక్ ఉన్నారు.

సంక్షిప్తం

14నుంచి దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి 269వ ఉరుసు ఈనెల 14వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. 14న గంధం, 15న ఉరుసు, 16న జియారత్ తో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

బాలికల సమస్యలపై సర్వే

పత్తికొండ రూరల్ : మండలంలోని దూదేకొండ గ్రామంలో బాలికల సమస్యలపై కైవల్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆ సంస్థ ప్రతినిధి నిధిసింగ్ సర్వే చేపట్టారు. హెచ్‌ఎం భాస్కర్‌తో మాట్లాడి పాఠశాలలో బాలికలు ఎదురుకుంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుడు హుసేన్, సీఆర్‌పి తులసిరెడ్డి ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆలూరు: సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంత్సరంలో చేరే విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని అరికెర గ్రామ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్‌రాజ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి మార్చి 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఇంగ్లిష్‌లో రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

కేసులను ఎత్తివేయాలి

హొళగుంద: రెండేళ్ల క్రితం మండల కేంద్రంలో ఊరేగింపు సమయంలో రెండు వర్గాల ప్రజల మధ్య జరిగిన సంఘటనలో నమోదైన కేసులను ఎత్తి వేయాలని బీజేపీ ఆదోని డివిజన్ అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పురుషోత్తం రెడ్డి కోరారు. గురువారం ఆయన హొళగుందలో విలేకరులతో మాట్లాడుతూ గతంలో జరిగిన ఊహించని సంఘటన కారణంగా రెండు వర్గాలకు చెందిన యువకులు, విద్యార్థులు, గ్రామపెద్దలు కేసులో ఇరుక్కుని నేడు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జక్కనాచారి, కెఎస్ ప్రసాద్, మహేష్, ఉలిగన్న, గంగప్ప ఉన్నారు.

జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు

మద్దికెర : స్థానిక పెద్దనగిరి కాలనీలో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు వేశామని జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి తెలిపారు. గురువారం సీసీరోడ్డు పనులను పరిశీలించారు. ఎక్కువ రోజులు నీటితో క్యూరింగ్ చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. తర్వలోనే మహాత్మగాంధీ సర్కిల్ నుంచి ట్యాంకు వరకు రూ.10 లక్షల జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

నీటి సమస్యకు పరిష్కారం

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి మూడు బోర్లు వేయించినట్లు జెడ్పీటీసీ లింగప్ప తెలిపారు. గురువారం బోర్లను ప్రారంభించి మాట్లాడుతూ జెడ్పీటీసీ గ్రాంట్ కింద దాదాపు రూ.5 లక్షల వ్యయంతో బోర్లను ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. మాజీ ఎంపీపీ బసప్ప, మాజీ కన్వీనర్ భీమప్పచౌదరి ఉన్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు


మాట్లాడుతున్న మచ్చ సుధీర్ బాబు

ఆలూరు రూరల్: అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మచ్చ సుధీర్ బాబు తెలిపారు. గురువారం ఆయన ఆలూరు ఎక్సైజ్ పోలీసు స్టేషన్ తనిఖీ చేశారు. మద్యం షాపు నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గీత కార్మికుల మద్యం షాపు టెండర్ల ప్రక్రియ ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. గీత ఉపకులాలకు చెందిన వారు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎమ్మార్పీపై మార్జిన్ 14 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత, ఎస్‌ఐ నవీన్ బాబు ఉన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ..

పత్తికొండ రూరల్ : పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను ఆ శాఖ ఎస్పీ సుధీర్‌బాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీఐ విశ్వేశ్వరరావుతో మాట్లాడి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని మద్దికెరలో మద్యం షాపునకు ఈడిగ కులస్తులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శుక్రవారంతో గడువు ముగుస్తుందన్నారు.

పంచాయతీ తీర్మానం మేరకే గదుల కేటాయింపు

మద్దికెర : గతంలో పంచాయతీ స్థలాల్లో వ్యాపారాలు చేసుకొని జీవనం చేస్తున్న వారికి నూతనంగా గదులు నిర్మించి పంచాయతీ తీర్మానం ప్రకారమే అద్దెకు ఇచ్చామని ఈఓ శివకుమార్ అన్నారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన పంచాయతీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈఓ మాట్లాడుతూ గ్రామంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఈనెల 13న మద్దమాంబ జాతర జరుగనుందని తేరు బజారులో మట్టి వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


సచివాలయాల తనిఖీ

హాలహర్వి: మండలంలోని బిలేహాల్, నిట్రవట్టి, విరుపాపురం గ్రామ సచివాలయాలను పత్తికొండ డీఎల్‌పీవో వీరభద్రప్ప గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిట్రవట్టి సచివాలయంలో ఒక్క అధికారి లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా సచివాలయాల్లో కూడా సిబ్బంది సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విధుల పట్ల అలసత్వం వహించే సిబ్బందికి మెమోలు జారీచేస్తామని స్పష్టం చేశారు. అనంతరం గూళ్యం, నిట్రవట్టి, బిలేహాల్, విరుపాపురం గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఉలిగమ్మ, విజయమ్మ, మంజుల, గాదిలింగప్ప, మల్లి, నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి దస్తగిరయ్య స్వామి ఉరుసు

కృష్ణగిరి: మండలంలోని ఆలంకొండ గ్రామ శివారులోని కొండపై వెలసిన దస్తగిరయ్యస్వామి ఉరుసును శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం ఉదయం నాగదేవత పూజ, అభయాంజనేయస్వామి పూజ, 10గంటలకు పోతప్ప పూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు గంధం, ఉరుసు ఉంటుందన్నారు. అదే రోజు అంతర్రాష్ట్ర గిరక బండి (తూర్పు నాటి) ఎద్దులకు పోటీలు నిర్వహిస్తారు. గెలుపొందిన యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.6వేలు, రూ.3వేలు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే మధ్యాహ్నం అంతర్రాష్ట్ర హోం టీం కబడ్డీ పోటీలు ఉంటాయని గెలుపొందిన జట్లకు వరుసగా రూ 20 వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.6 వేలు, రూ.5 వేలు అందజేస్తామన్నారు. 9న తెల్లవారుజామున షంషేర్ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు.

ఘనంగా గజోత్సవం


ఉచ్ఛాయాన్ని లాగుతున్న భక్తులు

హొళగుంద: మండల కేంద్రంలో సిద్దేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గజోత్సవం ఘనంగా జరిగింది. గజ వాహనంపై ఆశీనులైన సిద్ధప్ప, సిద్ధమ్మ ఉత్సవమూర్తులను ఉచ్ఛాయంపై అధిష్టింపజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉచ్ఛాయాన్ని తేరు బజారులోని ఎదురు బసవన్న గుడి వద్దకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఆలయ ధర్మకర్తలు రాజపంపన్నగౌడ్, శివన్నగౌడ్, సిద్దార్థగౌడ్, హరీష్‌గౌడ్ పాల్గొన్నారు.

పరీక్షలపై ఆందోళన వద్దు

ఆలూరు: పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆలూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వాయుజోపోత్తంరావు, షేక్షావలి అన్నారు. ఎల్లార్తి రోడ్డులోనున్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం సీపీఎం మండల కార్యదర్శి షాకీర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రజ్ఞా వికాసం మోడల్ ప్రశ్న పత్రాల పేపర్లను అందజేశారు. ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ ,డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

వెల్దుర్తి బాలికల హాస్టల్‌లో డిజిటల్ తరగతులు

వెల్దుర్తి: స్థానిక బీసీ బాలికల హాస్టల్‌కు సంబంధిత శాఖ అధికారులు ఐఎఫ్‌పీ ప్యానెల్ మంజూరు చేశారు. ఈ మేరకు హాస్టల్‌లో డిజిటల్ ప్యానెల్ ద్వారా విద్యార్థినులకు ట్యూషన్ తరగతులు అందుబాటులోకి వచ్చాయి . గురువారం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజ మాట్లాడుతూ పది, తొమ్మిదవ తరగతి విద్యార్థినులకు ఆన్‌లైన్ విద్యాబోధన, ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.


భక్త కన్నప్ప ఆలయ ప్రాంతంలో నిలిచిన మురుగు

గూళ్యం.. దుర్గంధం

హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామంలో మురుగు నీరు వీధుల్లో నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. భక్త కన్నప్ప ఆలయ ప్రాంతంలో కుళాయినీరు, మురుగు నీరు రోడ్లపైనే నిల్వ చేరి దోమలకు ఆవాసాలు మారాయి. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.


గుడెంపాడు నుంచి పుట్లూరు వెళ్లే రహదారిలో ఇలా ఇరువైపులా కంపచెట్లు

పొదల మాటున ప్రమాదం

కృష్ణగిరి: మండలంలో గ్రామీణ రహదారులకు ఇరువైపులా కంపచెట్లు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పుట్లూరు నుంచి గుడెంపాడుకు, అమకతాడు నుంచి మాదాపురం, కర్లకుంటకు, కృష్ణగిరి నుంచి వెల్దుర్తికి వెళ్లే రహదారికి, చుంచుఎర్రగుడి నుంచి సంగాల, చిట్యాలకు వెళ్లే రహదారులకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో వాహనదారులు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పలుసార్లు ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి కంప చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

అన్నదాతకు నీటి పరీక్ష

కృష్ణగిరి: వర్షాధారంపై పంటలు సాగు చేస్తే ఏటా నష్టాలు మిగులుతున్నాయి. దీంతో మండలంలోని పలువురు రైతులు బోర్ల కిందనైనా పంటలు సాగు చేస్తే కాస్త మిగులుతుందనే ఆశతో నీటికోసం భగీరథ యత్నానికి పూనుకున్నారు. రబీ పంట కోతలు పూర్తయిన రైతులు లక్షల రూపాయలు వెచ్చించి బోర్లు వేయిస్తున్నారు. అయినప్పటికీ చాలా చోట్ల నీటి జాడ లభించకపోయినప్పటికీ తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం మాత్రం ఆపడం లేదు.


ఎరుకలచెరువు పొలాల్లో బోరు వేస్తున్న దృశ్యం

పందిరి సాగు.. భలే బాగు..


దేవనకొండలో కాకర పంటకు పందిరి వేసిన దృశ్యం

దేవనకొండ: పందిరి పంటల సాగుతో రైతులు లాభాలు పొందొచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. తీగజాతి కూరగాయలైన కాకర, చిక్కుడు, బీర తదితర కూరగాయలు నేలపై పండిస్తే భూమిపైనున్న తేమ వల్ల పంట దెబ్బతినే అవకాశముందని, పందిరి వేస్తే కూలీల ఖర్చు ఆదా అవడమే కాకుండా నాణ్యమైన దిగుబడి లభిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో రైతులు పందిరి పంటలను వారి సూచనలనుగుణంగా సాగు చేస్తున్నారు.